# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

OCTOBER - 1998

# సంక్షిప్త వార్తలు

1998 సెప్టెంబరు 21వ తేదీనాడు అమెరికా నుండి వచ్చిన సేవకులు రోయస్ ఫ్రెడరిక్ మరియు రేండల్ హేగ్‌వుడ్ గార్లు కాకినాడలో సత్యవాణి బిల్డింగ్‌లో పలువురి సువార్తికులను కలసికొని వారిని వ్యక్తిగతముగా ప్రోత్సహించిరి. ఆత్మీయముగా వెనుకబడిన వారిని హెచ్చరించిరి. తదుపరి శ్రీకాకుళం, చీపురుపల్లి ప్రాంతములలో వాక్యపరిచర్య గావించిరి. అక్టోబరు 14 నాటికి వారిరువురు తమ స్వదేశమునకు తిరిగి ప్రయాణం చేయుదురు.

1998 అక్టోబరు 1వ తేదీ గురువారం నుండి 4వ తేదీ ఆదివారం వరకు నిజామాబాద్ పట్టణంలో గొప్ప క్రీస్తు సువార్త సభలు నిర్వహించబడెను. ఈ సభలను నిజామాబాద్‌లో యున్న క్రీస్తు సంఘము అత్యంత ఘనముగా నిర్వహించిరి. నిజామాబాద్ పట్టణమునుండియు, పరిసర ప్రాంతములనుండియు వందలాది మంది హాజరైరి. మరియు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుండియు కూడ సోదరులు ఈ కూటములకు హాజరైరి.

మణిపూర్ రాష్ట్రమునుండి సోదరులు శ్యామ్‌సలాం గారు సతీసమేతముగాను, కలకత్తానుండి సోదరులు కె. స్వామిదాస్ గారును హాజరైరి. ఈ సోదరులిద్దరు కూటముల నాలుగుదినములు ఆంధ్రనుండి వచ్చిన సువార్తికులతో కలసి వాక్య పరిచర్య చేసిరి. శ్రీకాకుళం నుండి ఆర్. సి.హెచ్. సద్గుణరావ్ గారు, కడలి నుండి వి, చిన్నయ్యగారు, దేవగుప్తం నుండి యన్. ఏలియాగారు, కాకినాడనుండి జాషువా గూటం గారు కుటుంబసమేతంగా వచ్చి మంచి వాక్య పరిచర్య చేసిరి.

నిజామబాద్ స్థానిక క్రీస్తు.సంఘ యువతీ యువకులు చక్కటి పాటలను తయారు చేసి వినిపిస్తూ అందరితో కలిసి దేవుని స్తుతించిరి. ఈ యువకులకు సోదరులు రవిబాబుగారు, వారి సతీమణి ప్రేమలత గారు చక్కటి తర్ఫీదునిచ్చి మాధుర్య సంగీతము యొక్క రుచిని ప్రజలకు చవి చూపించిరి. అక్టోబరు 4వ తేదీ ఆదివారం ఆరాధనలో ఇంచుమించు 700 మంది పాల్గొనిరి. ఆరాధన అనంతరం 11మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

నిజామాబాద్ పట్టణంలోను పరిసర ప్రాంతములలోను సోదరులు యన్. టైటస్ గారు క్రీస్తుకొరకు, ఆయన సంఘము కొరకు నిర్విరామ కృషిని

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 19 అక్టోబరు 1998 సంచిక 3


## సంపాదకీయం

### క్రీస్తు సంఘము ఒక మతశాఖ కాదు
### ( Church of Christ is not a Denomination )

క్రీస్తు సంఘము ఒక మతశాఖ యని అనేకుల అభిప్రాయము. క్రీస్తు సంఘమును ద్వేషించు అనేకులున్నారు. "క్రీస్తు సంఘస్థులు వాక్యమందు ఈలాగు వ్రాయబడి యున్నదని చెప్పుదురు గాని ఆచరింపరు" అని కొందరనుచున్నారు. ఉపదేశము మరియు ఆచరణ వీటిలో ఏది లోపించినను దేవుని సంతోషపరచలేము. లేఖనాను సారమైన ఉపదేశమును ప్రక్కన పెట్టి, స్వంత సిద్ధాంతాలు బోధించేవారిని గూర్చి దేవుని ఆవేదనను లేఖనములందు చదువగలము "ఈ ప్రజలు పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. వారు మానవులు కల్పించిన పద్ధతులు దేవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుదురు" (మార్కు 7:7).

మానవ కల్పిత నామములు, బోధలు మరియు విశ్వాసప్రమాణములు దైవలేఖనాలకు విరుద్ధమైనవి. నేడు మానవ కల్పిత సిద్ధాంతాలు ఎక్కువ ఆచరణలో ఉన్నాయి. క్రీస్తు సంఘము లేఖనముల అధికారమునకు లోబడునట్టి సంఘము. లేఖనములు సంపూర్ణమైన దేవుని చిత్తము గనుక వేరొక బయలుపాటు కొరకు మానవుడు ఎదురుచూడనవసరము లేదు. మన జీవమునకు భక్తికి కావలసిన ప్రతి అంశము లేఖనములయందు భద్రము చేయబడింది. అపొస్తలులు బోధించిన సువార్త గాక మరియొక సువార్తను ఎవడు బోధించినను అతడు శాపగ్రస్తుడని వ్రాయబడింది (గలతీ 1:8-9).

అనేకులు తమకు 'దర్శనము' కలిగినదని దేవుడు తమకు తన చిత్తమును బయలు పరచెనని చెప్పుదురు. వీరే దేవుని లేఖనాలకు విరోధులు. పరిశుద్ధాత్మ ప్రేరిత లేఖనాలను విస్మరిస్తూ, తమ చిత్తాన్ని లోకానికి చాటుచూ, సిలువకు శత్రువులుగా ఉన్నారు. వీరు క్రీస్తు సంఘస్థులను గూర్చి "వారు పరిశుద్ధాత్మను నమ్మరు" అని చెప్పుదురు. పరిశుద్ధాత్మ వలన కలిగిన లేఖనముల అధికారమునకు మానవుడు లోబడి యుండాలని ప్రతి ప్రసంగమందును క్రీస్తు సంఘస్థులు చెప్పుదురు. "మేము బైబిలు మాట్లాడుచోట మాటలాడుదుము. బైబిలు మౌనముగా నున్న చోట మౌనముగా నుందుము". బైబిలు సంగతులను బైబిలు పేర్లతోనే పిలువ బడాలని, ప్రతి వ్యక్తి తెరువబడిన బైబిలు గ్రంథమునొద్దకు రావాలని బోధించుచు, స్వచ్ఛమైన క్రొత్తనిబంధన క్రైస్తవ్యమును ప్రకటించు చున్నాము.

"స్వస్థత" అనే నినాదము ప్రజలను ఈనాడు విశేషముగా ఆకర్షించుట వలన ఈ నినాదంతో ప్రజల మధ్యకు వెళ్ళాలని అనేక ఆధునిక మతశాఖల వారు అభిప్రాయ పడుచున్నారు. మేమైతే ఏ భౌతికమైన ఆశను చూపక దేవుని వాక్యమును సమయమందును, అసమయమునందును ప్రకటించుచున్నాము. వేలాది సమూహములను ఆకర్షించాలనే తపన కంటే సత్యమునకు విధేయుడైన ప్రతి ఒక్క ఆత్మ నిమిత్తమును ఆనందింతుము.

వాయిద్యాల యొక్క "భౌతిక ప్రేరణ" ఆత్మీయమైనది కాజాలదు. అది నిర్జీవ నాదమని బైబిలు చెప్పుచున్నది. "ఆయన చేతులతో సేవింపబడువాడు కాడు" (అపొ.కా. 17:25). వాయిద్యాలు మనుష్యులను ఎంత ఆకర్షించినను అవి భౌతికమైన ఫలితాలను తప్ప, ఆత్మీయ ఫలితాలను యివ్వవు. ఒకాయన నాకు ఉత్తరం వ్రాస్తూ "మీకు ఘల్లుమనే విదేశీద్రవ్యం కావాలి, వాయిద్యాలు అవసరం లేదు" అని వ్రాసాడు. విదేశీ ద్రవ్యమయినా, స్వదేశీ ద్రవ్యమయినా ద్రవ్యము ద్రవ్యమే, సువార్త ప్రకటనలో ధనం అవసరమే కాని అపేక్షించడం పాపమౌతుంది. స్వదేశీధనాన్నయినా అపేక్షించడం పాపమౌతుంది.

"క్రీస్తు సంఘస్థులు మారుమనస్సు లేనివారు" అనేది ఒక విపరీత వాదన. మారుమనస్సు అంటే వేషధారణకాదు. హృదయాంతరంగములో కలిగిన మంచి మార్పును 'మారుమనస్సు' అంటారు. క్రీస్తు సంఘాలలో వేషధారణ కన్పించదు. సంఘము పొలమయితే అందు గోధుమలతో పాటు గురుగులు ఉంటాయి. గురుగులు ఉన్నాయని పొలము మంచిది కాదని ఎవరూ చెప్పలేరు. తీర్పు దినాన అవి వేరు చేయబడతాయి.

క్రీస్తు సంఘము క్రీస్తు శరీరము. (ఎఫెసీ 4:4). క్రీస్తు శరీరములో లేకుండ ఎవడును క్రీస్తు వాడు కాలేడు. ప్రియచదువరీ ! క్రీస్తు సంఘము లేఖనాను సారమైనదో కాదో అని నీవు గ్రహించుటకు బైబిలును పఠించుము. సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుము (1థెస్స 5:21).

- E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

## ఎవరితో సహవాసం చేయవచ్చును ?

(Who can be fellowshipped ?)

సహవాసము అనగా స్నేహం, సుహృద్భావం, సాంగత్యం మొదలగునవి. ఆత్మీయముగా ఒకే విశ్వాసం, ఆచరణ, విధేయత, ఒకే కుటుంబములోనున్న

సభ్యులు, ఇచ్చిపుచ్చుకొనుట, పంచుకొనుట యని అర్థం. ఆత్మీయంగా మనం కొందరితో సహవాసం చేయుచున్నామంటే, సహవాసం చేయలేనివారు కొందరుంటారు దానిలోనే ఇమిడియున్నది. మనం ఎవరెవరితో సహవాసం చేయరాదో ముందు తెలిసికొందాము.

1. అపవాది, దయ్యములు : అపొ.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు : "అన్యజనులర్పించు బలులు దేవునికి కాదు దయ్యములకే అర్పించుచున్నారని చెప్పుచున్నాను. మీరు దయ్యములతో పాలివారవుట నాకిష్టములేదు" (1కొరింథీ 10:20).

2. అవిశ్వాసులు : "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" (కీర్తన 14:1).

3. పాపులు : "ఇప్పుడైతే సహోదరుడనబడిన వాడెవడైనను జారుడు గాని, లోభిగాని విగ్రహారాధకుడు గాని, తిట్టిబోతుగాని, త్రాగుబోతుగాని, దోచుకొనువాడు గాని అయ్యున్న యెడల అట్టివానితో సాంగత్యము చేయకూడదు, భుజింపనుకూడదని మీకు వ్రాయుచున్నాను'' (1కొరింథీ 5:11).

4. లోకస్థులు : "ఈ లోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు'' (1యోహాను 2:15).

5. అబద్ధ బోధకులు : "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మల యందును దయ్యముల బోధయందును లక్ష్య ముంచి విశ్వాస భ్రష్టులగుదురు" (1తిమోతి 4:1-2). "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువును కూడా విస ర్జించుచు, తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగ జేసికొనుచు నాశనకరమగు భిన్నాభి ప్రాయములను రహస్యముగా బోధింతురు. మరియు అనేకులు వారి పోకిరి చేష్టలను అనుసరించి నడుతురు; వీరిని బట్టి సత్య మార్గము దూషింపబడును" (1పేతురు 2:12).

6. అపనమ్మకస్థులు : "ఎవడైనను (క్రీస్తు) బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ ఇంట చేర్చుకొనవద్దు; శుభమని వాని చెప్పవద్దు. శుభమని వానితో చెప్పు వాడు వాని దుష్ట క్రియలలో పాలివాడగును" (2యోహాను :10,11).

7. లేఖనముల ప్రకారము సహవాసమునుండి తొలగింపబడిన వారితో సహవాసము చేయరాదు (మత్తయి 18:15-17).

## ఎవరితో సహవాసము చేయాలి ?

1. సువార్తకు లోబడిన వారితో : అపొ.కా. 2:38-40 ప్రకారము అనేకులు సువార్త కు లోబడగా వారు "అపొస్తలులు బోధయందును, సహవాసమందును, రొట్టె

విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరని" చెప్పబడినది (అపొ.కా. 2:47).

2. దేవుని బిడ్డలు, క్రీస్తు సంఘ సభ్యులతో సహవాసం చేయాలి : "మరియు రక్షింప బడుచున్న ప్రతివారిని అనుదినము ప్రభువు వారితో చేర్చు చుండెను" (అపొ.కా. 2:47). "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నాను" (గలతీ 3:26-27).

3. క్రీస్తుతో ఏకమైన వారితో సహవాసం చేయాలి : "సహోదరులారా మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండ వలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును బతిమాలుకొనుచున్నాను" (1కొరింథీ 1:10).

4. క్రీస్తు నామమును ధరించువారితో సహవాసం చేయాలి : "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొంద లేము" (అపొ.కా. 4:12). క్రీస్తు సంఘ సభ్యులు క్రైస్తవులు (1పేతురు 4:11). మరియు సంఘము క్రీస్తు నామమును ధరించును (రోమా 16:16).

5. ఆత్మతోను సత్యముతోను ఆరాధించువారితో సహవాసము చేయాలి: "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి" (యోహాను 4:24).

6. ఒకే సువార్తను బోధించు వారితో సహవాసము చేయాలి : మనము క్రీస్తు సువార్తను బోధించాలి. (మార్కు 16:15). వేరొక సువార్తను బోధించువాడు శాపగ్రస్థుడగును (గలతీ 1:6-9).

7. నమ్మకముగా యుండువారితో సహవాసము చేయాలి : "మరణము వరకు నమ్మకముగా యుండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదనని" ప్రభువు చెప్పారు (ప్రకట 2:10).

నీవు దేవునియొక్కయు, క్రీస్తుయొక్కయు ఆయన ప్రజల యొక్కయు సహవాసములో యున్నావా? లేనియెడల నీవు నిరీక్షణ లేక నశించిన స్థితిలో యున్నావు. అపవాదితోను అంధకార క్రియలతోను సహవాసములో యున్నవారు నశింతురు. దేవుని తట్టు తిరుగుము. ఆయన సువార్తకు లోబడుము. నిజ క్రైస్తవులతో సహవాసము కలిగియుండుము.

-జె.సి. ఛోట్

## ఆరాధన
## (Worship)

"ఆరాధన" మనకు దేవుడు అనుగ్రహించిన గొప్ప దీవెన. ఎందుకనగా ఇశ్రాయేలీయులు దేవుని సన్నిధిలో నిలుచు అవకాశమును దేవుడు వారికి అనుగ్రహించలేదు. "కాగా యెహోవా మోషేతో ఇట్లనెను: నీవు ఇశ్రాయేలీయులతో- మీరు లోబడనొల్లని ప్రజలు, ఒక క్షణ మాత్రము నేను మీ నడుమకు వచ్చితినా, మిమ్మును నిర్మూలనము చేసెదను" (నిర్గమ 33:5). "వారు చావక యుండునట్లు పరిశుద్ధ స్థలమును రెప్పపాటు సేపైనను చూచుటకు లోపలికి రాకూడదు" (సంఖ్యా 4:20). కాని ఈనాడైతే మనము క్రీస్తు మూలముగా క్రీస్తు నామమున దేవుని సన్నిధిలో నిలబడి ఆయనను ఆరాధించే భాగ్యమును పొందియున్నాము. కనుక ఆరాధన మనకు దేవుడు అనుగ్రహించిన గొప్ప దీవెన.

## I. ఆరాధన యొక్క ప్రారంభము :

1. కయీను, హేబేలులు దేవునికి అర్పణలు తీసుకురాగా, యెహోవా హేబేలును అతని అర్పణను లక్ష్యపెట్టెను (ఆది 4:3-4). ఎందుకనగా "విశ్వాసమును బట్టి హేబేలు కయీను కంటె శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను" (హెబ్రీ 11:4).

2. తరువాత ఆదాము హవ్వలు తమ కుమారుడైన - షేతు మరియు షేతు కుమారుడైన ఎనోషులతో కలసి యెహోవా నామమున ప్రార్థన చేయుట ఆరంభించినట్లుగా బైబిలులో చూడగలము. "మరియు షేతునకు కూడ కుమారుడు పుట్టెను; అతనికి ఎనోషను పేరు పెట్టెను. అప్పుడు యెహోవా నామమున ప్రార్థన చేయుట ఆరంభమైనది" (ఆది 4:26).

3. జల ప్రళయము తరువాత నోవహు అతని కుటుంబము దేవుని ఆరాధించినట్లుగా (ఆది 8:20) చదువగలము.

4. దేవుని ఆజ్ఞ ప్రకారము అబ్రాహాము తన దేశమును, బంధువులను తన తండ్రి ఇంటిని విడచి దేవుడు చూపించబోవు దేశమునకు బయలు దేరి "బేతెలుకు తూర్పున నున్న కొండకు చేరి పడమటనున్న బేతెలుకును తూర్పున నున్న హాయికిని మధ్యన గుడారము వేసి అక్కడ యెహోవాకు బలిపీఠము కట్టి యెహోవా నామమున ప్రార్థన చేసెను" (ఆది 12:8).

5. యాకోబు పద్దన రాము ప్రయాణములో దేవునికి మ్రొక్కుకొనెను. "మరియు స్తంభముగా నేను నిలిపిన ఈ రాయి దేవుని మందిరముగను మరియు నీవు నాకిచ్చిన యావత్తులో పదియవ వంతు నిశ్చయముగ నీకు చెల్లించెదనని మ్రొక్కుకొనెను" (ఆది 28:20).

పై సందర్భములన్నిటిలో పితరుల యుగములో కుటుంబపరముగాను, వ్యక్తిగతంగాను దేవుని ఆరాధించినట్లు మనము గ్రహించగలం.

అయితే ధర్మశాస్త్ర యుగములో దేవుడు ఇశ్రాయేలీయులకు ఒక ఆరాధన దినము, ఆరాధన స్థలము మరియు పది ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును వారికి అనుగ్రహించి ఆచరించమని ఆజ్ఞాపించెను (నిర్గమ 20:8-17, 20:22-26). ధర్మశాస్త్రము వలన ఏ మనుష్యుడు నీతిమంతునిగా తీర్చబడలేని కారణమున (గలతీ 2:16) దేవుడు క్రీస్తు ద్వారా క్రొత్త నిబంధనను అనుగ్రహించి క్రొత్త నిబంధన ఆరాధన ప్రవేశపెట్టెను (హెబ్రీ 8:7-13). ఆరాధన దినము ఏది ? క్రీస్తు సిలువ మరణము పొంది సమాధి చేయబడి తిరిగి పునరుత్థానుడైన దినము ఆదివారము కావున ఆరోజున ఆరాధన చేయవలెను (అపొ.కా. 20:7).

## II. ఆరాధన యొక్క భావము :-

1. గౌరవించునట్లు మ్రొక్కుట. ఉదా :- జ్ఞానులు బాలుడైన క్రీస్తును ఆరాధించిన విధానము (మత్తయి 2:10-11) లో చదువగలము. 2. భయముతో కూడిన ప్రవర్తన. 3. భక్తితో కూడిన గౌరవము. 4. సంఘపరముగాను, వ్యక్తిగతముగాను దేవుని స్తుతించుట, మరియు 5. భక్తి పూరితమైన క్రియలు చేయుట.

## III. శ్రేష్టమైన ఆరాధన యేది ?

1. సమూ 15:22 - ఆయన ఆజ్ఞను గైకొనుట శ్రేష్టమైన ఆరాధన.

2. రోమా 12:1-2 - పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది.

3. మార్కు 12:33 - పూర్ణ హృదయముతోను, పూర్ణ వివేకముతోను, పూర్ణ బలముతోను, ఆయనను ప్రేమించుటయు, ఒకడు తన్నువలె తన పొరుగువానిని ప్రేమించుటయు సర్వాంగ హోమములన్నిటికంటెను బలులు కంటెను అధికమని ఆయన చెప్పెను.

## IV. ఆరాధన ఎట్లు చేయవలెను ?

యోహాను 4:24 - "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను".

1. ఆత్మ అనగా
↓
మనస్సు, హృదయములతో
అంతే గాని భౌతికముగా కాదు

2. సత్యముతో అనగా దేవుని వాక్యముతో
↓
"సత్యమందు వారిని ప్రతిష్ట
చేయుము; నీవాక్యమే సత్యము
(యోహాను 17:17).

ఆరాధనలోని అంశములు : - అపొ.కా. 2:42 - "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుట యందును ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి" ఆరాధనలో

1. ప్రార్ధన

2. పాటలు పాడుట

3. వాక్యపఠనము

4. ప్రభురాత్రి భోజనము

5. కానుకలు

అను 5 అంశములు ఉండాలి. ఒక్కొక్క అంశమును గూర్చి వివరించుకుందాము.

1. ప్రార్ధన :- మనము చేయు ప్రార్ధన కూడా వాక్యానుసారముగా ఉండాలి. ప్రార్ధన తండ్రియైన యెహోవా దేవునికి చేయాలి. మన ప్రార్ధనలో దేవునికి కృతజ్ఞతలు

తెలియజేయాలి. మనకొరకు మన కుటుంబము కొరకే కాక అందరి క్షేమము కొరకు మరియు సంఘక్షేమాభివృద్ధి కొరకు ప్రార్ధన చేయాలి. మన ప్రార్ధన క్రీస్తు నామమున దేవునికి సమర్పించాలి. ఎందుకనగా ఫిలిప్పీ 2:5-11 ప్రకారము ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను. మన ప్రార్ధన లూకా 18:10-14లో వ్రాయబడిన పరిసయ్యుని ప్రార్ధన వలెకాక, సుంకరి ప్రార్ధన వలె ఉండవలెను.

**2. పాటలు పాడుట :-** ఆరాదనలో పాటలు పాడేటప్పుడు వాయిద్యములను ఉపయోగించరాదు. మనసుతోను, హృదయముతోను పాడాలి. మన నోటితో పాడుచూ జిహ్వాఫలములు దేవునికి అర్పించాలి. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

"ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19).

**3. వాక్యపఠనము :-** దేవుని వాక్యమును లేఖనములు చదివి అర్థం చేసుకొని సత్యమును గ్రహించాలి. వాక్యమును సరిగా విభజించాలి (2తిమోతి 2:15). అపొస్తలుల బోధను అనుసరించాలి అంతేకాని అబద్ధ బోధకుల బోధను అనుసరించకూడదు. ఆరాధనలో దేవుని వాక్యమును పఠించుట, నేర్చుకొనుట ద్వారా దినదినము ఆత్మీయంగా అభివృద్ధి చెందుతాము. దేవుని చిత్తము లేఖనములలో పొందు పరచబడినది. దర్శనములు, కలలు ద్వారా దేవుని చిత్తము బయలు పడదు.

**4. ప్రభురాత్రి భోజనము :-** "పాపపరిహారార్ధ బలిగా దానిని అర్పించిన యాజకుడు దానిని తినవలెను; పరిశుద్ధ స్థలమందు, అనగా ప్రత్యక్షపు గుడారము యొక్క

ఆవరణములో దానిని తినవలెను" (లేవీ 6:26). ఇశ్రాయేలీయు లెవ్వరు తినుటకు వీలు లేదు. అయితే సమస్త మానవాళి పాపములు నిమిత్తము బలిగా అర్పించబడిన క్రీస్తు యొక్క శరీరమునకు సాదృశ్యముగా వున్న రొట్టెను క్రైస్తవులందరు భుజింపవచ్చును. రక్తమునకు సాదృశ్యముగా వున్న ద్రాక్షారసమును అందరూ త్రాగవచ్చును. ప్రభువు తాను అప్పగింపబడిన రాత్రి ఈ ఆజ్ఞను శిష్యులకు ఇచ్చారు. అపొస్తలుల ద్వారా ఈ ఆజ్ఞను మనము పొంది యున్నాము. ప్రతి ఆదివారము ఆరాధనలో ప్రభువు బల్లలో పాలు పంచుకోవాలి. మతశాఖలు వారు పాటిస్తున్నట్లుగా నెలకొకసారి, 6 నెలలకొకసారి సంవత్సరమున కొకసారి లేక కొన్ని ప్రత్యేక సందర్భాలలో వలె కాక ప్రతీ ఆదివారము ప్రభువు బల్లతో పాలుపంచుకోవాలని దేవుడు ఆజ్ఞాపించెను. ఆయనను జ్ఞాపకము చేసుకోడానికి ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించడానికి దీనిని చేయాలి (1కొరింథీ 11:23-28).

5. కానుకలు :- దేవుడు మనలను ప్రతి క్షణము కాచికాపాడి మనకు కావలసిన సమస్తమును అనుగ్రహించుచున్నాడు. మనము ఈ భూమిమీద జీవించగలుగుచున్నామంటే అది కేవలం దేవుని కృపవల్లనే! పాపులమైన మనల్ని ప్రేమించి తన ప్రేమకు ఋజువుగా మన అందరి పాపముల నిమిత్తము తన అద్వితీయ ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును మన విమోచనకొరకు సిలువ మరణముకు అప్పగించెను. దేవునికి మనం ఏమి యిచ్చినా ఆయన ఋణం తీర్చుకోలేము. దేవుడు విరిగి నలిగిన హృదయాల్ని కోరుచున్నాడు (కీర్తన 51:16-17). మనం అభివృద్ధి చెందిన కొలది హృదయంలో నిశ్చయించుకొన్న ప్రకారము దేవునికి కానుకలు అర్పించాలి. దేవునికి ఇవ్వవలసిన కానుకలను మన రాబడిని బట్టి ముందుగానే నిర్ణయించుకొని ఆ ప్రకారం యివ్వాలి. అలా కాకుండా ఆరాధనకు వచ్చి అప్పటికి మనకు తోచినట్లు లేక జేబులో మన చేతికి వచ్చిన కొంత చిల్లర నాణెములు వేయుట వాక్యానుసారమైన పద్ధతి కాదు. "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును

అని యీ విషయమై చెప్పవచ్చును. సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును (2కొరింథీ 9:6-7). కానుకలు కూడా ఆదివారం ఆరాధనలోనే ఇయ్యవలెను (1కొరింథీ 16:1-2). ఇచ్చుట అనునది దైవలక్షణం. మనం ఎంత అధికంగా దేవునికి కానుకలు ఇవ్వగలుగుచుంటే అంతగా దేవుని స్వరూపము లోనికి మార్పుచెందుతాము. దేవుడు ఇశ్రాయేలీయులను తమ రాబడిలో పదవవంతు (దశమ భాగములను) కానుకలుగా అర్పించమని ఆజ్ఞాపించాడు. అంతకంటె శ్రేష్ఠమైన నిబంధన క్రింద వున్న మనం దశమ భాగములకంటె ఎక్కువగా దేవునికి కానుకలు అర్పించాలి. ఇంతవరకు మనము నేర్చుకొనిన అంశములను బట్టి "ఆరాధన" మనకు దేవుడు అనుగ్రహించిన గొప్ప దీవెన అని తెలియుచున్నది. కావున క్రీస్తు సంఘమునకు వెలుపల ఉన్నవారు ఈ విషయములను చదివి సత్యమును గ్రహించి క్రీస్తులోనికి మార్పుచెందాలని ప్రేమ పూర్వకముగా మనవి చేస్తున్నాను.

**S.** వీరంశెట్టి, ముమ్మిడివరం.

## యాగము

(Sacrifice)

బైబిలునందు "యాగము" అను మాట ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. యాగము అనగా "సంపూర్ణ సమర్పణ" యై యున్నది. ఈ సమర్పణ క్రైస్తవునికి విధియై యున్నది. భారతదేశములో "యాగము" అను మాటకు మిక్కిలి ప్రాధాన్యతనిచ్చి యున్నారు. మునులు, ఋషులు యజ్ఞయాగాదులు చేయుచుండెడివారు. పాతనిబంధన కాలములో దీనిని "పాపపరిహారార్ధబలి" యని చెప్పబడినది. ఈ బలిని "అర్పణ" అని కూడ అనిరి. పాపపరిహారార్ధ బలి విషయమై మోషే అహరోనుతో యిట్లనెను. "నీవు బలిపీఠము నొద్దకు వెళ్ళి పాపపరిహారార్ధ

బలిని, దహనబలిని అర్పించి నీ నిమిత్తమును, ప్రజల నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేసి, యెహోవా ఆజ్ఞాపించినట్లు వారి నిమిత్తము ప్రాయశ్చిత్తము చేసి, యెహోవా ఆజ్ఞాపించినట్లు వారి నిమిత్తము, ప్రజల నిమిత్తమును ప్రాయశ్చిత్తము చేయుము" (లేవీ 9:7). అప్పటినుండి ఇశ్రాయేలీయులు ప్రతి ఏటా పాపపరిహారార్ధ బలిని అర్పించెడివారు. అందుకు ప్రధాన యాజకుడు నియమించబడి, ప్రతి సంవత్సరము ముందుగా తన పాపముల కొరకు, తరువాత అందరి పాపముల కొరకు పాపపరిహారార్ధ బలిని అర్పించెడివాడు. ఇట్టి యాగములు ప్రతి ఏటా జరుగుచుండెను. అయితే యాజకులు మరణము పొందుచున్నందున నిరంతరము జీవించు యాజకుడు అవసరమయ్యెను. "ధర్మశాస్త్రము బలహీనత గల మనుష్యులను యాజకులుగా నియమించును గాని, ధర్మశాస్త్రము తరువాత వచ్చిన ప్రమాణ పూర్వకమైన వాక్యము నిరంతరమును సంపూర్ణసిద్ధి పొందిన కుమారుని నియమించెను ....." (హెబ్రీ 7:27,28). "ఈయనవర్తైతే పాపముల నిమిత్తము సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి.... ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధ పరచబడు వారిని సదాకాలము సంపూర్ణులనుగా చేసి యున్నాడు" (హెబ్రీ 10:12-14). కావున ఇకను బలి అవసరము లేదుగాని, ప్రతి క్రైస్తవుడు నిత్యము "యాగము" చేయవలసియున్నది. అట్టి యాగములు లేదా అర్పణలు చేయక్రొత్త నిబంధన ఆదేశించుచున్నది. అవి ఏవన ? 1. స్తుతియాగము 2. శరీరయాగము. 3. ఉపకారయాగము. వీటిని చేయు ప్రతి క్రైస్తవుని విధియై యున్నది. ఒక్కొక్క దానిని గూర్చి వివరముగా తెలిసికొందాము.

**1. స్తుతియాగము :-** "స్తుతి" అనగా ఆరాధించుట. కీర్తించుట, స్తోత్రము చేయుట, పొగడుట యని తలంచవచ్చును. అనగా దేవునికి ఆరాధన సమర్పించుట. సంపూర్ణమైన సమర్పణను యాగము అందురు. యాగము ఆరాధన అను సంగతి మరువరాదు. పరిశుద్ధ గ్రంధమునుండి కొన్ని స్తుతి యాగములను గూర్చి ధ్యానించు కొందాము.

1. దావీదు యొక్క పాటకుల అధిపతి యిట్లు స్తుతించెను. "స్తుతియాగము అర్పించువాడు నన్ను మహిమ పరచుచున్నాడు, నేను వానికి దేవుని రక్షణ కనబరచునట్లు వాడు మార్గమును సిద్ధపరచుకొనెను" (కీర్తన 50:23). ఈ వాక్యము మనకేమి బోధించుచున్నది ? స్తుతియాగము చేయువాడు దేవుని మహిమ పరచును; అట్టివాడు తన రక్షణ మార్గమును సిద్ధపరచుకొనుచున్నాడని కీర్తన కారుడు వెల్లడించుచున్నాడు.

2. దానియేలు, మర్మములను బయలు పర్చిన దేవునికిట్లు స్తుతి చెల్లించెను. "అంతట రాత్రియందు దర్శనము చేత ఆ మర్మము దానియేలునకు బయలుపరచ బడెను గనుక దానియేలు పరలోకమందున్న దేవుని స్తుతించెను" "మా పితరుల దేవా, నీవు వివేకమును బలమును నాకనుగ్రహించియున్నావు, నేనడిగిన యీ సంగతిని ఇప్పుడు నాకు తెలియజేసియున్నావు గనుక నేను నిన్ను స్తుతించుచు ఘనపరచుచున్నాను......." (దాని. 2:19,23).

3. నిత్యము దేవుని స్తుతించు దావీదు యిట్లు ప్రకటించుచున్నాడు. "యెహోవాను స్తుతించుడి, యెహోవా సేవకులులారా, ఆయనను స్తుతించుడి. ఇది మొదలుకొని యెల్లకాలము, యెహోవా నామము స్తుతించబడునుగాక, సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయము వరకు యెహోవా నామము స్తుతినొందదగినది" (కీర్తన 113:1-3).

4. జెకర్యా తన కుమారునికి "యోహాను" అను పేరు పలకపై వ్రాసిన పిదప వెంటనే అతని నోరు తెరువబడి నాలుక సడలి అతడు దేవుని స్తుతించుచు మాటలాడెను (లూకా 1:64).

5. యేసుప్రభువు తండ్రిని యిట్లు స్తుతించెను; "తండ్రీ! ఆకాశమునకును భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలు పరచుచున్నావని నిన్ను స్తుతించు చున్నాను" మత్తయి 11:25 (లూకా. 10:21 చూడుము).

**a.** స్తుతియాగము ఎలాచేయాలి ? :- హెబ్రీ గ్రంధకర్త స్తుతియాగము ఎలా చేయవలెనో అను విషయమై స్పష్టమైన వివరణ యిచ్చి యున్నారు. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము. అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

పై వాక్యమందు స్తుతి యాగము చేయుటలో 3 ముఖ్యమైన విషయములు గమనించి స్తుతించి ఘనపర్చవలసియున్నది.

1. ఆయన ద్వారా :- మనము ఆరాధించునది, స్తుతించునది తండ్రియైన దేవుని; ఆయన ద్వారా అనగా యేసుక్రీస్తు ద్వారా స్తుతియాగము చేయ పరిశుద్ధాత్ముడు నాదేశించుచున్నాడు. "మరియు, మాట చేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తము ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17). లేఖనములు యిట్లు చెప్పుచుండగా మతశాఖలవారు యింకను పరలోక ప్రార్ధన చేయుట ఎంతటి అమాయకత్వము ? యేసుక్రీస్తు మహిమ పరచబడకముందు (పునరుత్థానుడవకముందు) శిష్యులకు నేర్పిన మాదిరి ప్రార్ధన చేయుట మిక్కిలి శోచనీయము. నీ స్తుతి, ఆరాధన యేసుద్వారా, సమస్తము ఆయన పేరిట చేయమనిన ఆజ్ఞకు పరలోకప్రార్ధన చేయుట విరుద్ధము కాదా ? విరుద్ధమే. కాబట్టి మన స్తుతి ఆయన (యేసు) ద్వారా ఉండవలెను.

2.ఆయన నామము ఒప్పుకొనుచు:- నీవు స్తుతి యాగము చేయునపుడు మందుగా ఆయన నామమును ఒప్పుకొని నీ స్తుతి యాగము అర్పించవలసి యున్నది. మతశాఖలవారు; యేసునే విశ్వసించుచున్నాము, ఆయనపేరటనే ఆరాధించుచున్నామని చెప్పుదురు గాని, యేసు నామమును ఎట్టి పరిస్థితులలోను ఒప్పుకొనరు; ఇది విచిత్రము కాదా ?

యేసుక్రీస్తు మనలను సాతాను దాస్యమునుండి విడిపించి పరలోకరాజ్యము చేర్చుటకు తన స్వరక్తమిచ్చి ఒక మార్గమును యేర్పరచెను. ఆ మార్గమే క్రీస్తు

సంఘము. ఇది బైబిలు సత్యము. ఇట్టి సంఘమును విసర్జించి మానవులు కల్పించిన సంఘములకు, మతములకు లోబడి క్రీస్తు నామము గాక మానవుల పెట్టిన నామములను ఒప్పుకొనుచు ఆరాధించుచున్నారు. ఉదా:- 1. లూథరన్ సంఘము 2. రోమన్ కేథలిక్ సంఘము 3. బాప్టిష్టు సంఘము 4. బేతేలు సంఘము మొదలైనవి. వీనిలో క్రీస్తు నామము ఎక్కడ ఉన్నది ? ఎక్కడ ఒప్పుకొను చున్నారు ? క్రీస్తు నామమును ఒప్పుకొనకయే ఆరాధించుచున్నారు. ఇట్టి (ఆరాధన) యాగమును వ్యర్థమైన యాగము (ఆరాధన) అని ప్రభువు చక్కగా వివరించెను. "ఈ మనుష్యులు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని, వారి హృదయము నాకు దూరముగానున్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9). కాబట్టి నీవు ఆయన నామమును ఒప్పుకొనుచు స్తుతి యాగము చేయుట దేవునికి ప్రీతికరము.

3. జిహ్వాఫలము :- జిహ్వాఫలము అర్పించుట యనగా నాలుక ద్వారానే స్తుతించాలని పరిశుద్ధాత్ముని యాదేశమైయున్నది. మనస్సులో ధ్యానించి నోటి ద్వారా స్తుతియాగము చేయవలెను గాని మరియే యితర నిర్జీవ వస్తువులు, పరికరముల ద్వారా అనగా వాయిద్యముల ద్వారా స్తుతించరాదని లేఖనములు ఉద్ఘాటించు చున్నవి.

దావీదు యెహోవా చట్టమును మీరి లేవీయులు మాత్రము వాయించు (2ది.వృ. 29:25) వాయిద్యములను వాయించి ఘోరమైన తప్పుచేసియున్నాడు. ఈనాడు ఆ తప్పును ఆదర్శంగా తీసికొని దావీదు వాయించెను, మనమెందుకు వాయించకూడదని తప్పుడు ప్రచారం చేయుచున్నారు. దావీదు పాపము చేస్తే మనం కూడ పాపం చేయవచ్చుననే గదా దీని భావం ? ఎంతటి వెర్రితనం.

మరికొందరు ఎఫెసీ 5:19; కొలస్స 3:16 లేఖనము భాగములలోని "సంగీతము" అను పదమును తప్పుగా అర్ధం చేసికొని, సంగీతము అనగా

వాయిద్యములని భావించి తమ వాదనను బలపరచకోజూచుచున్నారు. నిజముగా సంగీతమనగా వాయిద్యములు కాదు. సంగీతమనగా హృదయములోని తలంపులను స్వరపేటికల ద్వారా వచ్చు శబ్దములను లయబద్ధముగా ఆలపించుటయే సంగీతము (ఈ వాయిద్యములను గూర్చి 1996 అక్టోబరు సంచికలో వివరముగా వ్రాయబడెను).

పై లేఖనములోని సంగీతము ద్వారా 1. స్తుతించుట 2. కీర్తించుట 3. హెచ్చరించుట 4. బోధించుట 5. బుద్ధిచెప్పుట చేయవలెనని దేవుని చిత్తమైయున్నది మరి సితారా స్తుతించగలదా ? కంజెర కీర్తించగలదా ? హార్మోనియం హెచ్చరించ గలదా ? బుల్ బుల్ సితారా బోధించగలదా ? మృదంగం బుద్ధి చెప్పగలదా ? ఇట్టి వాయిద్యములు పై వాక్యములలోని దేవుని చిత్తమును నెరవేర్చవు గనుక అట్టి వాయిద్యములతో వాయించువారు పరలోకరాజ్యమును ప్రవేశించలేరు. "ప్రభువా ప్రభువా యని పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని నా తండ్రి చిత్త ప్రకారం జరిగించువాడే పరలోకరాజ్యంలో ప్రవేశించును" (మత్తయి 7:21). జిహ్వాఫలము అర్పించుట దేవుని చిత్తము గనుక అట్టివారే పరలోకరాజ్యంలో ప్రవేశింతురు కావున జిహ్వాఫలము ద్వారా స్తుతియాగము చేయ బద్ధులమైయున్నాము.

(సశేషము) జి. మార్కు, నందిగామ.

## ప్రభురాత్రి భోజనము

## (The Lord's Supper)

క్రైస్తవారాధనలో పాటలు పాడుట, ప్రార్ధన చేయుట, వాక్యమును వినుట, కానుకలిచ్చుట ఎంత ప్రాముఖ్యమో అట్లే ప్రభురాత్రి భోజనమునందు పాలు పొందుటకూడ అంతే ప్రాముఖ్యమైయున్నది. సత్యారాధనలో ఈ 5 అంశములు జరిగించవలెను. ఆదిమ క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాస

మందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" యని అపొ.కా. 2:42 చెప్పుచున్నది. రొట్టె విరుచుటను లేక ప్రభురాత్రి భోజనమును వారు ప్రతి ఆదివారమున చేయుచుండిరి. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెనని" అపొ.కా. 20:7లో వ్రాయబడియుండుట మనము చూడగలము.

## ప్రభురాత్రి భోజనమనగా ..

ప్రభురాత్రి భోజనమనగా యేమి ? అని మీరడుగవచ్చును. అది ఒక ఆత్మీయవిందు. యేసుక్రీస్తు సిలువవేయబడకముందు తన జ్ఞాపకార్థముగా ఆయన శిష్యులకిచ్చిన ఒక నిర్మల చిహ్నమది. అది ఆయన తన సంఘమయిన రాజ్యములో స్థాపించిన ఒక ఆత్మీయ సంస్థ అది. యూదుల ఆచార ప్రకారము పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు, యేసుక్రీస్తు తన శిష్యులతో పస్కాను భుజించుచుండగా యేసుక్రీస్తు ప్రభురాత్రి భోజనమును తన శిష్యుల కిచ్చెను. ఆ సందర్భమును మత్తయి ఇట్లు వివరించెను : "వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దానినాశీర్వదించి, విరిచి తన శిష్యుల కిచ్చి - మీరు తీసికొని తినుడి; ఇది నాశరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింప బడుచున్న నిబంధన రక్తము. నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినము వరకు, ఇకను దాని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 26:26-29).

యేసుప్రభువు ఆ రాత్రి భోజనము తన శిష్యుల కిచ్చు సరికి ఆయన రాజ్యము లేక సంఘము ఇంకను స్థాపించబడలేదు. గాని ఆయన పునరుత్థానుడైన తరువాత పెంతెకోస్తు అను పండుగ దినమున ఆయన సంఘము లేక రాజ్యము

స్థాపించబడెను. గనుక ప్రభువు, ఈ ప్రభువురాత్రి భోజనమును తన రాజ్యములో లేక సంఘములో యుంచెను.

ప్రభురాత్రి భోజనమునందు రొట్టె, ద్రాక్షారసము అను రెండు అంశము లున్నవి. ప్రతి క్రైస్తవుడు ప్రతి ఆదివారమున ఆ రొట్టెను తిని, ద్రాక్షారసమును పానము చేసి ప్రభువును జ్ఞాపకముంచుకొనవలెను.

ప్రభురాత్రి భోజనము ఒక స్మారక చిహ్నమై యున్నది. యేసుప్రభువు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములను మనము జ్ఞాపకముంచుకొనుట కీయబడిన ఒక సంస్థ అది. రొట్టెను భుజించునపుడు మానవుల పాప ప్రాయశ్చిత్తార్ధమై గాయపర్చబడిన యేసుక్రీస్తు శరీరమును జ్ఞాపకము తెచ్చుకొనవలెను. అట్లే ద్రాక్షారసమును పానము చేయునపుడు పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడిన యేసుక్రీస్తు యొక్క పవిత్ర రక్తమును జ్ఞాపకము తెచ్చుకొనవలెను. "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడి" యని యేసు చెప్పెను.

యేసుక్రీస్తు మరణించక మునుపు ప్రభురాత్రి భోజనమును స్థాపించెను గాని తన శిష్యులు దాని నాచరించుట కొరకు ఆయన రాజ్యము వచ్చువరకు కనిపెట్టవలెనని ఆయన చెప్పెను. ఆయన సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలుడైన పౌలు దాని నాచరించు విధానమును 1కొరింథీ 11:23-29లో ఇట్లు వివరించి యున్నాడు: "ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతా స్తుతులు చెల్లించి, దానిని విరిచి-యిది మీ కొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని-యీ పాత్ర నా రక్తము వలనైన క్రొత్తనిబంధన; మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు ఈ రొట్టెను తిని యీ పాత్రలోనిది త్రాగునపుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు.

కాబట్టి యెవడు అయోగ్యముగా ప్రభువుయొక్క రొట్టెను తినునో లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు, రక్తమును గూర్చియు అపరాధి యగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించు కొనవలెను; ఆలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను".

## సహవాస సమయము

ప్రతి క్రైస్తవుడు ప్రభురాత్రి భోజనములో ప్రతి ఆదివారమునాడు పాలుపొందుటకు ఆసక్తి కలిగి యుండవలెను. అందు పాలుపొందుట ద్వారా క్రైస్తవునికి క్రీస్తుతోను, ఆయన సంఘముతోను ప్రగాఢమైన సహవాసము ఏర్పడును. ప్రభువు బల్లలో పాలుపొందుట యేసుక్రీస్తు యొక్క శరీర, రక్తముల మేలులలో పాలుపొందుటయే. "మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే గదా ? మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయే గదా ? మనమందరము ఆ యొక్కటే రొట్టెలో పాలు పుచ్చుకొనుచున్నాము; రొట్టె యొక్కటే గనుక అనేకులమైన మము ఒక్క శరీరమై యున్నాము" అని 1కొరింథీ 10:16లో అపొ.పౌలు వ్రాసెను. కాబట్టి ప్రభురాత్రి భోజనము ద్వారా క్రీస్తులో లీనమవు అవకాశము క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైన ఆయన సంఘమునకు (కొలస్స 1:18) మాత్రమే యున్నది.

ప్రభురాత్రి భోజనము ద్వారా క్రైస్తవులు యేసుక్రీస్తు యొక్క మరణ పునరుత్థానములను జ్ఞాపకముంచుకొనుటయే గాక, ఆయన మరల తిరిగి రాబోవు చున్నాడని ప్రకటింతురు. మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు అని పౌలు చెప్పెను. యేసుక్రీస్తు సువార్త సర్వలోకమునకు ప్రకటింపబడవలెనని ఆయన కోరెను (మార్కు 16:15,16). ప్రభురాత్రి భోజనము ద్వారా ప్రతి క్రైస్తవుడు ఆ సువార్తను ఆయన రెండవ రాకడను ప్రకటించవీలగును. అందువలననే కొందరు

మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు.. ఒకని నొకడు పురికొల్పవలెను అని హెబ్రీ 10:25లో పౌలు క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు.

ప్రభురాత్రి భోజనమును ఎంతకాలమున కొకసారి మనము ఆచరించ వలెను ? ఆదిమ క్రైస్తవులు రొట్టె విరుచుటలో యెడతెగక యుండిరి. యని మనము ఇదివరకే గమనించాము (అపొ.కా. 2:42). వారు ఆదివారమున రొట్టె విరుచుటకు ప్రత్యేకముగా కూడుకొనిరి యని అపొ.కా. 20:7లో మనము చూచాము. గనుక ఈవాడు మనమును ప్రతి ఆదివారమున రొట్టె విరువ వలయును. క్రొత్త నిబంధన సంఘస్థులు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనమునందు పాలుపొందు చుండిరి యని పురాతన చరిత్రకారులు కూడా సాక్ష్యమిచ్చుచున్నారు. అయితే దేవుని కార్యక్రమమును మార్చి వేసి సంవత్సరమున కొకసారిగాని, 3 నెలలకొకసారి గాని, ఏదో ఒక శుక్రవారమునాడు గాని చేయవచ్చునని బోధించువారు, అట్లాచరించువారు యున్నారు. అయితే వారు లేఖనముల నెరుగక పొరబడుచున్నారు (మత్తయి 22:29). క్రొత్తనిబంధన ఆరాధనను పునరుద్ధరించవలెనంటే ప్రభురాత్రి భోజనమునకు తగిన ప్రాధాన్యతను ప్రతి ఆదివారమున ఒసగుట మంచిది. అది దేవుని ఏర్పాటేగాని మరియే మానవునిది కూడ-కాదు.

ప్రత్యేకింపబడిన వారే ప్రభురాత్రి భోజనమును జరిగించ వచ్చును అని అనేకులు సాధారణముగ తలంచెదరు. దేవుని వాక్యమయితే అట్టి భేదమును క్రైస్తవులలో సూచించుట లేదు. గనుక క్రీస్తును ధరించుకొనియున్న ప్రతి క్రైస్తవుడును ప్రభురాత్రి భోజనమును ఆరాధనలో పంచి పెట్టవచ్చును. ప్రతి క్రైస్తవుడును పరిశుద్ధ యాజకుడని భక్తుడైన పేతురు వ్రాయుచున్నాడు (1పేతురు 2:5,9).

క్రైస్తవులు ప్రభువు బల్లపైనున్న రొట్టెను తిని, ద్రాక్షారసమును త్రాగినప్పుడా రొట్టె ద్రాక్షారసములు నిజముగా క్రీస్తుయొక్క రక్తమాంసముల వలె మారిపోవును అని బోధించు అబద్ధ బోధకులు లేకపోలేదు. రొట్టె ద్రాక్షారసములు యేసుక్రీస్తు యొక్క శరీరమునకు, రక్తమునకు గురుతుగా, జ్ఞాపకార్ధముగానే ఈయబడెను. రొట్టెను తినునపుడు నా శరీరమును జ్ఞాపకముంచుకొనుడి అని యేసు చెప్పెను. ద్రాక్షారసమును త్రాగునప్పుడు నా రక్తమును జ్ఞాపకముంచు కొనుడి అని ఆయన చెప్పెను. గనుక ఆయన చెప్పినట్లు మనము చేయవలెను. అట్లుగాక మానవకల్పిత బోధలను బట్టి ప్రభురాత్రి భోజనము నాచరించిన యెడల అది అయోగ్యముగా ఆచరించినట్లగును. "కాబట్టి యెవడు అయోగ్యముగా పభువు యొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు, రక్తమును గూర్చియు అపరాధియగును" అని పరిశుద్ధాత్ముడు హెచ్చరించుచున్నాడు.

కేవలము క్రైస్తవులకు మాత్రమే ప్రభురాత్రి భోజనములో పాలుపొందు అవకాశము కలదు. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను. యేసుప్రభువు నందు సంపూర్తిగ విశ్వసించి నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా నీవు క్రీస్తు లోనికి రావచ్చును. "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసినయెడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము" అని యేసుక్రీస్తు పెలవిచ్చుచున్నాడు. నీవింకను క్రైస్తవుడవు కానియెడల యేసుక్రీస్తును నీ జీవితములోనికి ఆహ్వానించుటకు నేటికంటె మిన్నయైన తరుణము మరేమున్నది ?

-జాషువా గూటం.

## బైబిలు కరస్పాండెన్స్ విద్యార్థులకు ముఖ్య గమనిక

సత్యవాణి ద్వారా లక్షలాది ప్రజలు బైబిలు పాఠములను ఉచితముగా పోస్టు ద్వారా పొందుచు సత్యమును గ్రహించుచున్నారు. కొందరికి పాఠములు సకాలములో అందుట లేదనియు, అసలే అందుట లేదనియు మాకు తెలియ వచ్చినది. మీరు పూర్తిచేసిన ప్రశ్నాపత్రములు ఒక్కోసారి మాకు అందకపోవచ్చును. గనుక వెంటనే తదుపరి పాఠములను మేము పంపలేము. లేదా మేము మీకు పంపిన పాఠములు మీకు కూడ అందియుండక పోవచ్చును. గనుక మీరు మాకు ప్రశ్నాపత్రములను పూరించి పంపుట జరుగదు. అందువలననే మీకు మా వద్ద నుండి 15 రోజులలోగా పాఠములు అందకపోయిన యెడల మీకియ్యబడిన రిఫరెన్సు నంబరును మాకు వ్రాస్తు ఒక కార్డు ద్వారా తెలియజేయండి. మీరు మాకు రిఫరెన్సు నంబరుతో సహా తెలియజేయకపోతే మేము ఏమీ చేయలేము.

బేసిక్ బైబిలు కోర్సు పూర్తి చేసిన ప్రతివారికి ఉచితముగా బైబిలు బహుమతిగా ఇచ్చుచున్నాము. ఒకవేళ మీకు సర్టిఫికేట్ మాత్రమే అందియుండి, బైబిలు అందనిచో మాకు వ్రాయండి. మీ రిఫరెన్సు నంబరు వ్రాయుట మరచిపోవద్దు. బైబిళ్లను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుచున్నాము. గనుక మీకు అందకపోతే మేము తగుచర్య తీసికొనే అవకాశం కలుగును.

మీరు బేసిక్ బైబిలు కోర్సు ద్వారా ఆత్మీయముగా మేలు పొందితే మీ బంధువులు, మిత్రులను ఆ కోర్సులో చేర్పించండి. వారి అడ్రసులను మాకు పంపితే వెంటనే వారికి బైబిలు పాఠములను పంపించగలము. ఈ దిగువ అడ్రసుకు వారు గాని, మీరు గాని వెంటనే వ్రాయండి.

## క్రైస్తవ కీర్తనలు

237 కీర్తనలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం ఇప్పుడు మరల 5వ సారి ముద్రితమై లభ్యమగుచున్నది. అనేక పాత, క్రొత్త కీర్తనలు ఇందులో చేర్చబడినవి. పెద్ద అచ్చులో ముద్రితమై చక్కగా బైండింగ్ చేయబడి యున్నది. ఒకొక్క కాపీ మూల్యము 15/- రూపాయలు మాత్రమే. పోస్టేజీ అదనము. వలయువారు ఈ దిగువ చిరునామాకు మనియార్డరు చేయండి :

**SATYA VANI**

**P.O. Box. 80,**

**KAKINADA, 533 001 A.P.**

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
(క్రీస్తు సంఘము)
ఆహ్వానము
14వ గొప్ప బైబిల్ సెమినార్

తేదీలు : 1999 జనవరి 17 నుండి 21 వరకు
(ఆదివారం నుండి గురువారం వరకు)

స్థలము : పెర్రికోతమ్ సెమినార్ హాలు
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్, కాకినాడ - 533 003

ఉపదేశకులు :
1. Bro. JOHN FORD
2. Bro. BILL MYERS మరియు
3. Sis. NANCY FORD and
4. Sis. BILL MYERS (స్త్రీలకు ప్రత్యేక తరగుతులు నిర్వహించెదరు).

భారతదేశములో పలు ప్రాంతములనుండి ఈ సెమినార్‌కు అనేకులు ఏటేటా వచ్చుచు గొప్ప ఆత్మీయ మేలులు పొందుచున్నారు. గొప్ప సహవాసము, గొప్ప బైబిలు వర్తమానములు అందించబడుచున్నవి. దూరప్రాంతములనుండి వచ్చువారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. మీరు తప్పక విచ్చేయండి. మీకు మా ఆహ్వానము.

కాకినాడ,
10-10-98.

**Nehemaih Gootam**
Director

జరిపించుచు సత్యవాక్యమును ఉన్నది ఉన్నట్టుగా బోధించుచు బలమైన సంఘములను కట్టుచు క్రీస్తుకొరకు కట్టుదిట్టమైన పనిని తెలంగాణా ప్రాంతములో జరిగించుచున్నారు. తెలంగాణాలో ఆయన అనేక శ్రమలకోర్చి పలుచోట్ల చక్కటి ఆలయములను కూడా నిర్మించి క్రీస్తుసంఘము యొక్క పనిని స్థిరపరచి యున్నారు. వారితో కలసి ఆయన ఏకైక కుమారుడు ఎబినేజరు గారు కూడా సువార్త పనిలో చక్కటి చేయూతనిచ్చుచున్నారు. అంతేకాదు నిజామాబాద్ క్రీస్తు సంఘ సభ్యులు ప్రతివారు దేవుని పనిని తమ వ్యక్తిగత బాధ్యతగా యెంచి, గొప్ప ఐక్యతతో, సమన్వయముతో పనిచేసి సువార్త సభలను జయప్రదము గావించిరి. దూరప్రాంతములనుండి వచ్చినవారికి రుచికరమైన, శుచియైన భోజనమును ప్రతిరోజు ప్రతిపూట సరఫరా చేసిరి. ఆఖరి కూటము అనంతరం వాక్య పరిచర్య చేసిన సోదరులను స్థానిక సంఘము ఘనముగా సత్కరించి పారితోషకములను అందించిరి. భారతదేశములో నిజామాబాద్‌లో యున్నలాంటి క్రీస్తుసంఘములు ప్రతిచోట ప్రజ్వరిల్లాలని ప్రార్థించుదాం నిర్విరామ కృషిలో నిమగ్నమై యున్న టైటస్ గారిని వారి కుటుంబమును మన ప్రార్ధనలలో జ్ఞాపకముంచుకొందాం.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications , Kakinada - 533 004.

PRINTED BOOK - BOOK POST

From:
SATYA WAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To